క్లుప్తంగా

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రాజ్‌విహార్): అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షురాలు పి. నిర్మల డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బీ. క్యాంప్‌లోని స్త్రీ, శిశు సంక్షేమ సీడీపీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించాలని కోరారు. వర్కర్స్‌కు కొత్తగా పెరిగిన వేతనాలతో చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలకు పెంచాలన్నారు. కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని, ఫేషియల్ యాప్‌ను రద్దు చేయాలని కోరారు. దీనిపై ఫిబ్రవరి 6న కలెక్టరేట్ ముందు ధర్నాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విజయలక్ష్మీ, బాల దుర్గమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీడీపీఓ అనురాధకు వినతిపత్రం అందజేశారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయాలి

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని, అవి వారికి ప్రాణ రక్షణగా నిలుస్తాయని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆయన నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. అప్పుడే జన్మించిన బిడ్డ నుంచి టీకాలు వేసే పద్ధతిపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. తల్లిదండ్రులకు తమ శిశువుకు వయస్సు వారీగా వ్యాక్సిన్ షెడ్యూల్ ప్రకారం ఏఏ రకాల వ్యాధినిరోధక టీకాలు ఇవ్వాలనే విషయాలు కచ్చితంగా తెలిసి ఉండాలని చెప్పారు. అప్పుడే జన్మించిన బిడ్డకు 24 గంటల్లోపు వేసే టీకాల వల్ల క్షయ, పోలియో, హెపటైటిస్-బి వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్. నాగరాజు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కళావేదిక వసతి కల్పించాలి



ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లా రంగ స్థలం కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రంగస్థల కళాకారులకు కళావేదిక వసతి కల్పించాలని కోరుతూ కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం అధ్యక్షులు గుర్రప్పసాల అంకయ్య, సమితి ప్రధాన కార్యదర్శి హనుమంత రావు చౌదరి, జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షులు సయ్యద్ రోషన్ అలీ, ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్, మధుర కవి ఎలమర్తి రమణయ్య ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా పశుసంవర్ధకశాఖ పారా వెట్స్ అసోసియేషన్ 2023 టేబుల్ క్యాలెండర్‌ను ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి, జవహర్‌లాల్ ఆవిష్కరించారు. జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... పశుసంవర్ధకశాఖ ఉద్యోగులు, పారా వెట్స్‌కు ఏపీఎన్‌జీవో అసోసియేషన్ అన్ని విధాల అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, ఉమ్మడి జిల్లా శాఖ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి, నాన్ గజిటెడ్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు దేవరాజు, శ్రీరాములు, లక్ష్మీదేవి, యూసుఫ్, సుధాకర్ పాల్గొన్నారు.

హనుమద్ వాహనంపై శ్రీవారు

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరిహర క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, నారాయణ, ధన్వంతరి హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని హనుమద్ వాహనంపై నగరంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మహిళల కోలాటం, భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గురువారం వసంత పంచమి వేడుకలు, ఉచిత అక్షరాభ్యాసం, సరస్వతీ దేవి పూజలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కల్లె చంద్రశేఖర్‌శర్మ, కార్యదర్శి హెచ్.కె. రాజశేఖర్ రావు, ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి హెచ్‌కె మనోహర రావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్, వీర సింహారెడ్డి , వాల్తేరు వీరయ్య ,వారసుడు, హంట్
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు, మాలికాప్పురం,హంట్,సింధూరం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య, మాలికాప్పురం,హంట్,
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, పఠాన్, గాంధీ గాడ్సే ఏక్ యుద్ధ్,వాలంటీన్స్ నైట్
భరత్ కాంప్లెక్స్ : పఠాన్ , తెగింపు
రాజ్ : వీర సింహారెడ్డి
శ్రీరామ : వాల్తేరు వీరయ్య
విజయ : పఠాన్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య
- 20వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



గణేష్ నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బి.వై.రామయ్య

కల్లూరు: రాష్ట్రంలో అర్హులైన వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 20వ వార్డు 53వ వార్డు సచివాలయం పరిధిలోని బీటీఆర్ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలను వివరించారు. వారికి చేకూరిన లబ్ధిని తెలియజేసి బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కాలనీవాసులు తాగునీటి సమస్య పరిష్కరించాలని, డ్రైనేజీలు, రోడ్లు నిర్మించాలని తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకు వస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా గెలుపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, గాజుల శ్వేతారెడ్డి, మిద్దె చిట్టెమ్మ, పల్లె శారద, సంగాల సుదర్శన్‌రెడ్డి, దండు లక్ష్మికాంతరెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, ఎరుకల వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, భీమశంకర్‌రెడ్డి, వార్డుల ఇన్‌చార్జ్‌లు శ్రీధర్ రెడ్డి, బాలచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



గణేష్ నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్, పాణ్యం ఎమ్మెల్యే

కర్నూలు నగరంలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 19, 20వ వార్డులలో రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 19వ వార్డులో రూ.70 లక్షలతో శ్రీవారి కుటీర్ నుంచి వెంకటాద్రి నగర్ సబ్ స్టేషన్ వరకు డిస్పోజల్ డ్రైన్ నిర్మాణానికి, 20వ వార్డులో వాసవినగర్, విజయపురి కాలనీలో రూ.30 లక్షలతో డబ్ల్యూ.బీ ఎం రోడ్డు నిర్మాణానికి, ధనలక్ష్మినగర్‌లో రూ.50 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే, మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నగరంలో ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అవి ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయనన్నారు. ఈ ఏడాది చివరి నాటికి కర్నూలు నగరాన్ని ఆదర్శవంతమైన నగరంగా తీర్చుదిద్దేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు , మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వసంత పంచమి

కర్నూలు కల్చరల్: ఆవోపా ఆధ్వర్యంలో జిల్లా గోరక్షణ మహా సంఘం ప్రాంగణంలో గురువారం ఉదయం 8 గంటలకు వసంత పంచమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆవోపా చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు తెలిపారు. సరస్వతీ పూజ, చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అందరూ వేడుకల్లో పాల్గొన వచ్చని విజ్ఞప్తి చేశారు.

నేడు ‘దేశ భక్తిపై ఆట మాట పాట’

కర్నూలు కల్చరల్: రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా టీజీవీ కళాక్షేత్రంలో గురువారం సాయంత్రం 6 గంటలకు దేశ భక్తి గీతాలతో కూడిన ఆట మాట పాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. అలనాటి చిత్రాల్లోని దేశ భక్తి గీతాల నృత్యాలను చిన్నారులు ప్రదర్శిస్తారని, దేశభక్తి గీతాలను గాయనీ గాయకులు ఆలపిస్తారని పేర్కొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

కర్నూలు సిటీ: పదవ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేటట్లు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పని చేయాలని డీఈఓ డా.వి రంగారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక టౌన్ మోడల్ హైస్కూల్‌లో పది ఫలితాల పెంపుపై ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీఈఓ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పథకాల అమలు



చిత్తారి గేరిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): పేదలకు ఆర్థిక భరోసా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం రాత్రి ఆయన 7వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చిత్తరి వీధి సందుల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను పలుకరిస్తూ ప్రభుత్వం మూడేళ్లలో మంజూరు చేసిన సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందించారు. వారి సమస్యలు తెలుసుకొని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన పేదలకు నేరుగా పథకాలు అందించాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ విధానాన్ని తీసుకొచ్చారని చెప్పారు. దీంతో మధ్య దళారులు లేకుండా నేరుగా వారి ఖాతాలోకి నగదు జమ అవుతోందని వెల్లడించారు. దీంతో పథకాలను పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలకు మామూళ్లు అందిస్తేనే పథకాలు వచ్చేవని ఆరోపించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జుబేర్ అహ్మద్, నాయకులు నవీద్, పర్వేజ్, షోయబ్, అన్వర్, నజీర్, ఖలీల్, వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

‘ప్రత్యేక హోదా పేరుతో మోసం చేసిన వారికి బుద్ధి చెప్పాలి’

కర్నూలు(సెంట్రల్): ప్రత్యేక హోదా పేరుతో ప్రజలను మోసం చేసిన వారికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రత్యేక హోదా సాధన కోసం ప్రత్యేక హోదా సాధనసమితి ఆధ్వర్యంలో చేపట్టిన అనంతపురం- ఇచ్ఛాపురం బస్సుయాత్ర సాయంత్రం నాలుగు గంటలకు కర్నూలు చేరుకుంది. దీంతో బస్సు యాత్రకు వామపక్ష పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కలెక్టరేట్ వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏపీకి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, కడప స్టీలు ప్లాంటు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని బీజేపీ చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యుత్ సేవల్లో కర్నూలు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడంలో కర్నూలు జిల్లా ముందువరుసలో ఉంది. ఈ నేపథ్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పలు అవార్డులు ప్రకటించింది. సంస్థ పరిధిలోని ఐదు జిల్లాల్లో ఓవరాల్ పర్ఫార్మెన్స్‌లో కర్నూలు సర్కిల్‌కు చోటు కల్పిస్తూ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటు ఉత్తమ ట్రాన్స్‌ఫార్మర్స్ డివిజన్‌గా కర్నూలు, తక్కువ కాలిపోతున్న సబ్ డివిజన్‌గా కర్నూలు-1 నిలిచిందని కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి పేర్కొన్నారు.

29న సాహితీ సదస్సు

కర్నూలు కల్చరల్: అఖిల భారతీయ బ్రాహ్మణ కరవేణ నిత్యాన్నదాన సత్రం, తెలుగు అధ్యయన శాఖ సౌజన్యంతో ఈ నెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ‘జై తెలుగు’ అంశంపై సాహిత్య సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర తెలిపారు. ప్రముఖ పేరడీ కవి జొన్న విత్తుల రామలింగేశ్వరరావు, శతావధాని బ్రహ్మశ్రీ గండ్లూరి దత్తాత్రేయ శర్మ, తానా పూర్వ అధ్యక్షులు తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

సర్దుబాటు ఆర్డర్లు ఇవ్వాలి

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న తెలుగు, హిందీ పండిట్లకు పని సర్దుబాటు ఆర్డర్స్ ఇవ్వాలని కోరుతూ ఎస్‌జీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పూజారి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ధర్నాలో సంఘం నాయకులు సూర్యుడు, లక్ష్మన్న, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కర్నూలు(అర్బన్): జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములుగౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఏఐఎస్ఎఫ్ నేతలు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్ష్మమ్మను కలిసి వినతి పత్రం అందించారు. వినతి పత్రం అందించిన వారిలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీసు బేరర్ శరత్‌కుమార్, నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, మునిస్వామి, బన్ని తదితరులు ఉన్నారు.

నేటి నుంచి కాంగ్రెస్ పాదయాత్రలు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రిపబ్లిక్ దినోత్సవం (ఫిబ్రవరి 26) నుంచి మార్చి 26వ తేదీ వరకు పాదయాత్రలు నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు తెలిపారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో గ్రామ, గ్రామాన పాదయాత్రలు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. బుధవారం కాంగ్రెస పార్టీ కార్యాలయంలో పాదయాత్రలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..చేయి చేయి కలుపుదాం రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన కొత్తూరు సత్యనారాయణగుప్తా, నగర మహిళా కాంగ్రెష్ అధ్యక్షురాలుగా ఎంపికై న ఎస్.ప్రమీలకు నియామకపత్రాలను అందజేశారు.

27న శ్రీకృష్ణ దేవరాయల జయంతి

కర్నూలు(రాజ్‌విహార్): శ్రీ కృష్ణ దేవరాయల జయంతి వేడుకను ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు రాయల అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ కన్వీనర్ కోనేటి చంద్రబాబు అన్నారు. బుధవారం స్థానిక బిర్లా కాంపౌండ్ ఉన్న ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీ కృష్ణ దేవరాయల జయంతిని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామకృష్ణ, వెంకటేశ్వర్లు, చెన్నయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ పర్యాటక దినోత్సవం

కర్నూలు సిటీ: సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో చరిత్ర, పర్యాటక శాఖల ఆధ్వర్యంలో బుధవారం జాతీయ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి పి.విజయ పాల్గొని ప్రసంగించారు. పర్యాటక రంగం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని, దేశ ఆర్థిక వ్యవస్థకు ఓ ప్రధాన ఆదాయ వనరు పర్యాటకం అని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వి.వి ఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): ఈ నెల 26 నుంచి 30 వ తేదీ వరకు తమిళనాడులోని తిరుచ్చిలో నిర్వహించనున్న 44వ జాతీయ స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు ప్రతిభ చాటి పతకాలు సాధించాలని రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. బుధవారం పోటీల్లో పాల్గొంటున్న హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఎంపికైన జట్టును ఆయన ప్రకటించారు. బాలుర జట్టులో సంపత్‌కుమార్, షేక్షావలి, శేఖర్, స్వరూప్, బాష, సర్దార్, కామరాజు, ముత్యాల నాయుడు, రాజేష్, భరత్, మహేష్, దీపక్ సంజయ్‌లు ఉన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలి

కర్నూలు(అగ్రికల్చర్): బ్యాంకింగ్ రంగంలో వెంటనే ఐదు రోజుల పనిదినాలను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ జిల్లా కన్వీనర్ నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం గాయత్రి ఎస్టేట్‌లోని ఎంఎస్ఆర్ నగర్ ఎస్‌బీఐ శాఖ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వివిధ డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 30, 31వ తేదీల్లో చేపట్టిన బ్యాంకుల సమ్మెకు అన్ని బ్యాంకుల ఉద్యోగులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీఈఏ నాయకురాలు రోజారమణి, హరిని, సతీష్‌రెడ్డి, శివకృష్ణ, ఎస్ఐబీసీ నాయకులు పి.శ్రీకాంత్, ప్రవీణ్, ఎస్‌బీఐ ఆఫీసర్స్ యూనియన్ నేతలు టీవీ రమణ, ఏపీజీబీ నాయకులు హనుమంతరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): వచ్చే నెల 4వ తేదీ సేలం యూనివర్సిటీలో నిర్వహించనున్న ఆల్ ఇండియా యూనివర్సిటీ స్థాయి హ్యాండ్‌బాల్ అంతర్ కళాశాలల యూనివర్సిటీ పోటీలకు కర్నూలు డిగ్రీ కళాశాల విద్యార్థి జగదీష్ ఎంపికయ్యారు. దీంతో ఆ విద్యార్థిని బుధవారం స్థానిక కళాశాలలోని తన చాంబర్‌లో కరస్పాండెంట్ డాక్టర్ ఉమామహేశ్వరరావు అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ డిసెంబర్ 21, 22 తేదీలలో రాయలసీమ యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్ కళాశాలల పోటీల్లో మంచి ప్రతిభ కనబరచి ఆల్ ఇండియా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనసూయ, ఉమాకాంత్, గౌస్, జోసఫ్, రవీంద్ర, జయరాం పాల్గొన్నారు.

ఘనంగా ఓటరు దినోత్సవం



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): ప్రజాస్వామ్యం మనుగడ కోసం ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి అన్నారు. 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో ఉద్యోగులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. సీఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు తమ పరిధిలో ఓటు నమోదు చేసుకోని వారికి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని నమోదు చేసుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, పరిపాలనాధికారులు జితేంద్ర, మురళీమోహన్‌రెడ్డి, బసవశేఖర్, క్రిష్ణమోహనశర్మ, సరస్వతమ్మ, సౌభాగ్యలక్ష్మి, గాయత్రీ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (టౌన్): ఎన్నికల్లో నిర్భయంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. బుధవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో జాతీయ ఓటరు దినోత్సం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ ఎస్ఈ శేషసాయి, నగరపాలక కార్యదర్శి లావణ్య, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటర్లుగా నమోదు కావడంతో పాటు ఓటు హక్కు విధిగా వినియోగించుకోవాలని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడిషినల్ పీడీ శ్రీధర్‌రావు, లైవ్‌లీవుడ్ డీపీఎం నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: స్థానిక మైపర్ కాలేజీలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్, మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్‌లు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ రాజనీతి శాస్త్రం, ఎన్ఎస్ఎస్ విభాగంల ఆధ్వర్యంలో చేపట్టిన ఓటరు దినోత్సవంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ వొకేషనల్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, లెక్చరర్లు, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.పి కళావతి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో గురువారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఆలయ నాలుగవ వార్షికోత్సవం, రథ సప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. గురువారం గోపూజ, దత్తాత్రేయ స్వామికి అభిషేకం, గణపతి దత్త సరస్వతి హోమాలు, 27న శ్రీగౌరీ అమ్మవారికి అభిషేకం, లలితా సహస్రనామ హోమం, దత్త విజయానంద తీర్థ స్వామి అనుగ్రహ భాషణం, 28న సూర్యనారాయణ స్వామి మూల విరాట్‌కు అభిషేకం, అరుణ హోమం, 29న శ్రీ ఛాయా ఉమా సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం, 30న సుబ్రహ్మణ్య అభిషేకాలు, రాజ శ్యామల హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.



